
సాక్షి
గుంటూరు
గురువారం : 6 : ఫిబ్రవరి : 2025



వైభవంగా కల్యాణోత్సవం

నగరంపాలెం: స్థానిక బ్రాడీపేటలోని కుర్తాళం శ్రీ సిద్ధేశ్వరి పీఠ పాలిత ఓంకార క్షేత్రంలో బుధవారం రుక్మిణీ సమేత శ్రీకృష్ణ స్వామి కల్యాణం వైభవంగా జరిగింది.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం బుధవారం 548.50 అడుగుల వద్ద ఉంది. కుడి కాలువకు 10,120 క్యూసెక్కులు విడుదలవుతోంది.

రేషన్ బియ్యం స్వాధీనం



కొల్లిపర: మండల పరిధిలోని దంతలూరు గ్రామంలో మరియమ్మ అనే మహిళ ఇంటి వెనుక గుర్తు తెలియని వ్యక్తులు సుమారు 9 క్వింటాల 61 కేజీల రేషన్ బియ్యం ఉంచడంతో స్వాధీనం చేసుకున్నట్లు బుధవారం తహసీల్దారు జి.సిద్ధార్థ తెలిపారు.

న్యూస్‌రీల్

ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు పటిష్ట చర్యలు



లక్ష్మీపురం: ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ శాసనమండలి ఎన్నికలకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లోని డీఆర్సీ సమావేశ మందిరంలో విలేకరులతో ఆమె మాట్లాడుతూ.. నామినేషన్లు 10వ తేదీ వరకు స్వీకరిస్తామన్నారు. 8, 9 తేదీలలో సెలవులని చెప్పారు. మంగళవారం ఒక్క అభ్యర్థి నామినేషన్ వేశారన్నారు. ఓట్ల లెక్కింపు మార్చి 8వ తేదీ నాటికి పూర్తి చేయాలని ఎన్నికల సంఘం ఆదేశించిందని చెప్పారు. ఈ నియోజకవర్గం పరిధిలో గుంటూరు, పల్నాడు, ఎన్టీఆర్, కృష్ణా జిల్లాలు పూర్తిగా... ఏలూరు, బాపట్ల జిల్లాలలో కొంత భాగం ఉందన్నారు. జనవరి 30వ తేదీ నాటికి పురుషులు 2,06,176, మహిళలు 1,40,307, ట్రాన్స్‌జెండర్స్ 46 మంది కలిపి మొత్తం ఓటర్లు 3,46,529 మంది ఉన్నారన్నారు. ఫిబ్రవరి 10వ తేదీ నాటికి తుది ఓటరు జాబితాను ప్రకటిస్తామని చెప్పారు. 416 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు వివరించారు. 67 యాగ్జిలరీ కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదించామని చెప్పారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి పర్యవేక్షణకు గుంటూరు జిల్లాలో 23 ఫ్లయింగ్ స్క్వాడ్‌లు ఉన్నాయని చెప్పారు. సమావేశాలు, ర్యాలీలకు ముందస్తు అనుమతి తీసుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో ముగ్గురు అధికారులతో పాటు, ఒక మైక్రో అబ్జర్వర్ ఉంటారన్నారు. బ్యాలెట్ పేపరుతో మొదటి ప్రాధాన్యత ఓటు విధానంలో జరుగుతున్నందున చెల్లుబాటు అయ్యేలా ఓటు వేసేలా అవగాహన కల్పిస్తామన్నారు.

మిర్చి రికార్డు

యార్డులో 1,27,321 బస్తాలు విక్రయం



కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు బుధవారం భారీ స్థాయిలో ఈ సీజన్‌లోనే తొలిసారి అత్యధికంగా 1,21,569 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 1,27,321 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల సగటు ధర రూ.9,000 నుంచి రూ.15,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల సగటు ధర రూ.10,000 నుంచి రూ.15,500 వరకు ధర లభించింది. ఏసీ కామన్ రకం రూ.9,500 నుంచి రూ.11,500 వరకు ధర పలికింది. ఏసీ ప్రత్యేక రకాలకు రూ.11,000 నుంచి రూ.14,700 వరకు ధర లభించింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.10,000 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 72,162 బస్తాలు నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఎ.చంద్రిక తెలిపారు.

లక్ష్మీనృసింహస్వామికి వెండి పళ్లెం కానుక




మంగళగిరి: నగరంలో వేంచేసి ఉన్న శ్రీ లక్ష్మీనృసింహస్వామి వారికి దాతలు వెండి పళ్లెం కానుకగా సమర్పించారు. బుధవారం ఆలయ ఆవరణలో ఈవో కార్యాలయంలో ఆద్య బిల్డర్స్ అధినేత చిరుమామిళ్ల చంద్రశేఖర్ రూ.1.40 లక్షల విలువైన 1 కేజీ 35 గ్రాముల వెండి, 2 గ్రాముల బంగారంతో కూడిన పళ్లెంను ఈవో ఎ. రామకోటిరెడ్డికి అందజేశారు. దాతలను ఈవో అభినందించారు. స్వామి వారి వస్త్రాలతో సత్కరించారు.

సజావుగా ఒకేషనల్ ప్రాక్టికల్స్

గుంటూరు ఎడ్యుకేషన్: ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల్లో భాగంగా బుధవారం ఒకేషనల్ ప్రథమ, ద్వితీయ సంవత్సర విద్యార్థులకు ప్రాక్టికల్స్ ప్రారంభం అయ్యాయి. జిల్లావ్యాప్తంగా ఏడు కేంద్రాల పరిధిలో 1,111 మంది విద్యార్థులకు 1,034 మంది పరీక్షకు హాజరయ్యారు. ఉదయం 578 మందికి గాను 528, మధ్యాహ్నం 533 మందికిగాను 506 మంది హాజరైనట్లు ఆర్ఐవో జీకే జుబేర్ తెలిపారు.

లారీ పేరుతో లూటీ!



నేరం రూపు మారింది. అవగాహనా రాహిత్యానికి తోడు బాధితుల భయమే సైబర్ నేరగాళ్ల పాలిట వరంగా మారింది. ఎక్కడో ఉండి ఫోన్‌లోనే పోలీసులమని, అరెస్టు చేస్తామని బెదిరించగానే బ్యాంకు ఖాతాల్లో ఉన్నదంతా ఊడ్చి మరీ వారికి పంపుతున్నారు కొందరు. ఆనక మోసం అని తెలిసి లబోదిబోమంటున్నారు.

సైబర్ నేరగాళ్ల కొత్త అవతారం

- ఇప్పటికే జిల్లాలో పదుల సంఖ్యలో వెలుగు చూసిన పలు మోసాలు
- కష్టపడి సంపాదించిన రూ.లక్షలు పోగొట్టుకుంటున్న బాధితులు
- మోసపోతున్న వారిలో అత్యధికులు ఉన్నత విద్యావంతులు, ఉద్యోగులే
- నేరాల తీరుపై అవగాహన పెంచుకుంటేనే బ్యాంకు ఖాతాలు భద్రం

పట్నంబజారు: సైబర్ నేరగాళ్లు రోజుకో ఆలోచనతో ప్రజల్ని బురిడీ కొట్టిస్తున్నారు. ఓ సారి పోలీసులమని, మరోసారి అధికారులమని కొత్త దారుల్లో ఫోను చేసి బ్యాంకు ఖాతాలను లూటీ చేస్తున్నారు. ప్రతి ఒక్కరూ ఈ విషయంలో అప్రమత్తంగా ఉండడమే పరిష్కార మార్గమని పోలీసు అధికారులు సూచిస్తున్నారు. గత ఏడాది జిల్లాలో సుమారు 65కుపైగా సైబర్ కేసులు నమోదు అయ్యాయి. ఇక ఆన్‌లైన్‌లో వందల సంఖ్యలో అందుతూనే ఉన్నాయి. సామాజిక మాధ్యమాల ద్వారా లింకులు పంపి మరీ దుండగులు దోచుకుంటున్నారు. నగదు బదిలీ చేసిన గంటల వ్యవధిలోనే ఫిర్యాదు చేస్తేనే ప్రయోజనం ఉంటుంది. సైబర్ క్రైం హెల్ప్‌లైన్ నెంబర్ 1930, ఆర్థిక నేరాలకు సంబంధించి 155260, సైబర్ క్రైమ్.జీఓవీ.ఇన్ అనే వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయవచ్చు.

ఉమెన్ ట్రాఫికింగ్‌లో ఇరికించి రూ.24 లక్షలు..

గుంటూరు నగరం కొత్తపేట పరిధి నెహ్రూనగర్‌కు చెందిన వృద్ధుడు వంకాలయ నాగేశ్వరరావుకు ఇటీవల కాల్ వచ్చింది. బెంగళూరు పోలీసులమని నమ్మించారు. ఉమెన్ ట్రాఫికింగ్‌కు పాల్పడుతున్న వ్యక్తిని అరెస్ట్ చేస్తే అతడి వద్ద నాగేశ్వరరావు పేరిట సిమ్‌కార్డు ఉందని చెప్పారు. నిందితుడు రూ. 30 లక్షల నగదు కూడా నాగేశ్వరరావుకు ఇచ్చినట్లు చెబుతున్నాడని వాట్సాప్ కాల్ ద్వారా భయభ్రాంతులకు గురి చేశారు. పరువు పోతుందని భావించి దఫాలుగా బ్యాంకులోని మొత్తం రూ. 24 లక్షలు వారికి పంపాడు. ఇంకా పంపకపోవడంతో బెదిరింపులు వచ్చాయి. అప్పటికిగానీ విషయాన్ని కుటుంబ సభ్యులకు నాగేశ్వరరావు తెలిపాడు. దుండగులు నకిలీ పోలీసులని తెలిసింది.

పార్శిల్ వచ్చిందంటూ రూ.11 లక్షలు..

నరసరావుపేటకు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని సాయిసత్యశ్రీ వర్క్ ఫ్రం హోం చేస్తున్నారు. గత ఏడాది అక్టోబర్‌లో ముంబై నార్కోటిక్ కంట్రోల్ బ్యూరో నుంచి మాట్లాడుతున్నామని దుండగుడు చెప్పాడు. ఆమె పేరుతో వచ్చిన కొరియర్‌లో ల్యాప్‌టాప్, 450 గ్రాముల గంజాయి ఉన్నట్లు నమ్మించాడు. ఆమెకు సంబంధించిన క్రెడిట్ కార్డు నెంబర్ చెప్పి భయపెట్టాడు. రూ.11 లక్షలు ఇచ్చి సెటిల్ చేసుకోమన్నాడు. సత్యశ్రీ తన ఖాతా నుండి ఆ మొత్తం పంపారు. కుటుంబ సభ్యులకు తెలిశాక అసలు విషయం తేలింది.

నగ్న వీడియోతో ఎర వేసి రూ.8 లక్షలు..

గుంటూరు నగరం అరండల్‌పేటకు చెందిన వస్త్ర దుకాణ యజమానికి కొద్ది కాలం క్రితం అజ్ఞాత నెంబర్ నుంచి హాయ్ అంటూ మేసేజ్ వచ్చింది. మహిళ కావడంతో మాటలు కలిశాయి. రెండు రోజుల తర్వాత వాట్సాప్ వీడియో కాల్‌లో నగ్నంగా ఆమె వచ్చేసింది. వ్యాపారి సైతం నగ్నంగా మారడంతో మొత్తం వీడియో రికార్డు చేశారు. ఆ మరసటి రోజే మహారాష్ట్ర పోలీసునని ఓ వ్యక్తి లైన్‌లోకి వచ్చాడు. మహిళను వేధిస్తున్నావని ఫిర్యాదు అందిందని, సదరు వీడియో కూడా పంపాడు. భయపడిన వ్యాపారి నుంచి రూ.8 లక్షలు లాగేశారు. కేసు పెడితే పరువు, కాపురం ఏమవుతాయోనని ఆయన వెనక్కితగ్గాడు.

అవగాహన ముఖ్యం



సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తూనే ఉన్నాం. అయినప్పటికీ కొందరు నేరగాళ్ల బారిన పడుతున్నారు. పోలీసు అని ఫోన్ చేసినా.. బ్యాంకు అధికారులమని చెప్పినా.. సమీపంలోని పోలీసు స్టేషన్‌కు సమాచారం ఇవ్వండి. లేదంటే ఆ ఫోన్ కాల్‌ను కట్ చేయండి.

– ఎస్. సతీష్‌కుమార్, ఎస్పీ, గుంటూరు జిల్లా

కూటమి రాక్షసత్వాన్ని ప్రజలు గుర్తించాలి



వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి మాట్లాడుతున్న అంబటి రాంబాబు

- వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లకు కూటమి తాయిలాలు
- కీలకంగా వ్యవహరించిన కేంద్ర సహాయ మంత్రి, ఎమ్మెల్యేలు
- స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో కార్పొరేటర్ల క్రాస్ ఓటింగ్ అనైతికం
- ఐదేళ్లపాటు మేయర్‌గా కావటి, డిప్యూటీ మేయర్‌గా బాలవజ్రబాబు
- నిధుల దుర్వినియోగంపై ప్రజాస్వామ్య పద్ధతిలో పోరాటం
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి అంబటి రాంబాబు

నగరంపాలెం (గుంటూరు వెస్ట్): ఇటీవల జరిగిన జీఎంసీ స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు కొందరు రాజకీయం చేశారని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి అంబటి రాంబాబు మండిపడ్డారు. గుంటూరు నగరంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో బుధవారం అంబటి మాట్లాడుతూ... స్టాండింగ్ కమిటీ ఎన్నికల వేళ 56 మంది కార్పొరేటర్లలో 33 మంది తమ వారేనని అన్నారు. అందులో ఒకరు స్వతంత్ర, 32 మంది పార్టీ గుర్తుపై గెలిచారని చెప్పారు. ఇక కూటమి ప్రభుత్వం నుంచి వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లకు బెదిరింపుల పర్వం మొదలైందని ఆరోపించారు. కార్పొరేటర్లకు పార్టీ కండువాలేయడం, డబ్బులు ముట్టజెప్పడం మామూలైందని మండిపడ్డారు. కేంద్ర సహాయ మంత్రి, ఎమ్మెల్యేలు తీవ్ర ప్రలోభాలకు గురిచేశారని ధ్వజమెత్తారు. మా పార్టీ తరఫున నలుగురు కార్పొరేటర్లు క్రాస్ ఓట్లేయడం బాధించిందని అన్నారు. త్వరలో మేయర్, డిప్యూటీ మేయర్, మిగిలిన కార్పొరేటర్లు ఇక ఉండరనే కూటమి రాక్షసత్వాన్ని నగర ప్రజలు గమనించాలని కోరారు. వీరిపై అవిశ్వాస తీర్మానం చేసినా చెల్లదని, ఐదేళ్లపాటు మేయర్, డిప్యూటీ మేయర్ కొనసాగుతారని స్పష్టం చేశారు. స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో అనేక ప్రలోభాలకు గురి చేసినా 24 మంది తమ పార్టీ కార్పొరేటర్లు ధైర్యంగా నిలబడ్డారని తెలిపారు. జీఎంసీ కమిషనర్ బుడమేరు వరదల సమయంలో రూ.9.24 కోట్లు కాజేశారని ఆరోపించారు.

- ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం మాట్లాడుతూ ఎన్నికల్లో ప్రలోభాలకు గురి చేశారనేది స్పష్టంగా తెలుస్తోందన్నారు. పార్టీలో ఇష్టం లేని వారు బయటకు వెళ్లొచ్చని చెప్పారు.
- మేయర్ కావటి మనోహర్‌నాయుడు మాట్లాడుతూ.. టీడీపీ గొప్ప విజయం సాధించినట్లుగా మాట్లాడటం సిగ్గుచేటన్నారు. పదవుల కోసం కక్కుర్తి పడబోమని, గత నాలుగేళ్లలో అభివృద్ధి చేశామన్నారు. ఇవేమీ తెలియకుండా మాట్లాడటం సరికాదని ప్రత్తిపాడు ఎమ్మెల్యే రామాంజనేయులుకు హితవు పలికారు.
- డిప్యూటీ మేయర్ బాలవజ్రబాబు మాట్లాడుతూ.. లోపాయికారి ఒప్పందాలతో స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో కొందరు ఓట్లేశారని ఆరోపించారు. అధికారం కోసం పాకులాడేది టీడీపీ అని, ప్రజల విశ్వాసం కోసం పనిచేసే పార్టీ తమదని పేర్కొన్నారు.
- తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి నూరిఫాతిమా మాట్లాడుతూ.. స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో కార్పొరేటర్లకు డబ్బులు ఆశ చూపి టీడీపీ వారిని గెలిపించుకునేందుకు నానా కష్టాలు పడ్డారని మండిపడ్డారు.
- మాజీ ఎంపీ మోదుగుల వేణుగోపాలరెడ్డి మాట్లాడుతూ.. గుంటూరు ప్రజలను కూటమి నేతలు ఓడించారని ఆరోపించారు. ఇదేం ప్రజాస్వామ్యం అంటూ మండిపడ్డారు. గతంలో కమిషనర్‌గా పనిచేసిన కీర్తి చేకూరిపై ఆరోపణలు లేవని గుర్తుచేశారు. రిటైర్డు అయినా పిలిచేలా చేస్తున్నారని కమిషనర్‌పై పరోక్షంగా వ్యాఖ్యానించారు. కమిషనర్ కూడా ఎమ్మెల్యేగా పోటీ చేస్తానని అడుగుతారని, ఆయన కోసం కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని సాయం చేస్తారని ఆరోపించారు. మిర్చియార్డు మాజీ చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ, కార్పొరేటర్ గోపీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఇసుక రీచ్‌లలో అధికారుల తనిఖీలు

- రాత్రింబవళ్లు ఇసుక తవ్వేసిన భారీ యంత్రాల తరలింపు
- ఇకపై ఇలా చేస్తే ఊరుకోబోమని అధికారుల హెచ్చరిక



సాక్షి ఎఫెక్ట్

తెనాలి: కొల్లిపర మండలంలోని బొమ్మువానిపాలెం ఇసుక రీచ్‌లలో అక్రమ ఇసుక తవ్వకాలకు బ్రేక్ పడింది. 'ఇసుకంతైనా లెక్క లేదు' శీర్షికన 'సాక్షి'లో బుధవారం వచ్చిన వార్తా కథనానికి అధికారులు స్పందించారు. మంగళవారం రాత్రి, బుధవారం ఉదయం 8 గంటల వరకు తవ్వకాలు చేసిన జేసీబీలను అధికారులు రీచ్‌కు చేరుకునే సమయానికి అక్రమార్కులు పక్కకు పంపారు. నదిలోని భారీ వాహనాలైన టిప్పర్లు, లారీలు లోడింగ్ అయినవి వెళ్లిపోగా, మిగిలినవి రీచ్‌కు దూరంగా రోడ్డుపైకి చేరుకున్నాయి. మండల తహసీల్దార్ జి.సిద్ధార్థ, కొల్లిపర ఎస్ఐ పి.కోటేశ్వరరావులు ఇసుక రీచ్‌లను సందర్శించారు. అప్పటికే రీచ్‌లన్నీ ఖాళీగా దర్శనమిచ్చాయి. నదిలో యంత్రాలతో ఇసుక తవ్వినట్టుగా తమ దృష్టికి వస్తే రీచ్‌లను నిలిపివేస్తామని తహసీల్దార్ చెప్పారు. రీచ్‌ల వద్ద ఏర్పాటు చేసిన రెవెన్యూ, పోలీస్ సిబ్బంది అక్రమ తవ్వకాలు జరుగుతుంటే తమకు వెంటనే సమాచారం ఇవ్వాలని ఆదేశించారు. లేకపోతే సిబ్బందిపైనా క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రీచ్‌ల నిర్వహణకు గడువు గురువారంతో ముగిసిపోతున్న విషయం తెలిసిందే. దీంతో యంత్రాలతో తవ్వేశారు. పత్రికల్లో వార్తలు వచ్చినపుడే అధికారులు రీచ్‌లకు వెళుతున్నారు.

హీరో మహేష్‌బాబు ఓటు తొలగింపు

- ఎమ్మెల్సీ ఎన్నికల్లో మహేష్ పేరుతో తప్పుగా ఓటు
- 'సాక్షి' కథనంతో వెలుగుచూసిన అధికారుల నిర్వాకం
- ఓటు తొలగించినట్లు ఏఈఆర్వో వెల్లడి


గుంటూరులో
హీరో మహేష్‌బాబుకు ఓటు

గుంటూరు ఎడ్యుకేషన్ : శాసనమండలి కృష్ణా–గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికలకు సంబంధించిన ఓటరు జాబితాలో ప్రముఖ సినీ నటుడు ఘట్టమనేని మహేష్ బాబు పేరుతో నమోదైన ఓటును తొలగించినట్లు గుంటూరు నగరపాలకసంస్థ అదనపు కమిషనర్, ఏఈఆర్వో చల్లా ఓబులేసు గురువారం తెలిపారు. గుంటూరులో హీరో మహేష్‌బాబుకు ఓటు శీర్షికతో బుధవారం ''సాక్షి'' మెయిన్ ఎడిషన్‌లో ప్రచురితమైన కథనానికి ఏఈఆర్వో స్పందించారు. మహేష్‌బాబు పేరుతో ఓటు తప్పుగా నమోదైందని, ఫారం–7 విచారణ అనంతరం ఓటును తొలగించామని వివరించారు. గుంటూరు అర్బన్‌లో దరఖాస్తులపై బూత్ లెవల్ అధికారులతో విచారణ చేయించామన్నారు. అర్హులైన వారి దరఖాస్తులను ఆమోదించినట్లు పేర్కొన్నారు.

నేటి నుంచి విజ్ఞాన్ మహోత్సవ్

వివిధ రాష్ట్రాల నుంచి 50 వేల మంది విద్యార్థులు రాక



సాధనలో నిమగ్నమైన విద్యార్థులు

చేబ్రోలు: చేబ్రోలు మండలం వడ్లమూడిలోని విజ్ఞాన్ యూనివర్సిటీ ప్రతిష్టాత్మకంగా నిర్వహించే జాతీయ స్థాయి విజ్ఞాన్ మహోత్సవ్ 18వ ఎడిషన్‌కు ఏర్పాట్లు పూర్తయ్యాయని వైస్ చాన్సలర్ పీ నాగభూషణ్ బుధవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. ఈ కార్యక్రమాన్ని నేటి నుంచి మూడు రోజుల పాటు అత్యంత వైభవంగా నిర్వహించనున్నామని తెలిపారు. ముఖ్య అతిథులుగా ఇండియన్ సింగర్, మ్యూజిక్ కంపోజర్ డాక్టర్ సాలూరి కోటేశ్వరరావు (కోటి), ఇండియన్ మ్యూజిక్ కంపోజర్ అండ్ ప్లేబాక్ సింగర్ ఎస్.ఎస్.తమన్, గౌరవ అతిథిగా ఇండియన్ వాలీబాల్ మాజీ ప్లేయర్ మన్యం తులసి రెడ్డి హాజరవుతారని వెల్లడించారు. రెండో రోజు కార్యక్రమానికి నటుడు విశ్వక్ సేన్, నటి ఆకాంక్ష శర్మ, అభిమన్యు సింగ్ విచ్చేస్తున్నారని పేర్కొన్నారు. చివరి రోజు జరిగే ముగింపు కార్యక్రమానికి దర్శకుడు కేఎస్ రవీంద్ర (బాబీ), 2024 పారా ఒలింపిక్స్ బ్రాంజ్ మెడలిస్ట్ , ఇండియన్ పారా పిస్టల్ షూటర్, అర్జున అవార్డీ రుబినా ఫ్రాన్సిస్ రానున్నారని తెలిపారు. మహోత్సవ్‌లో పాల్గొనేందుకు వివిధ రాష్ట్రాల నుంచి 50 వేల మంది విద్యార్థులు రానున్నారని వెల్లడించారు. పోటీల విజేతలకు రూ.15 లక్షలకు పైగా బహుమతులను అందజేస్తామని తెలిపారు.

80 ఈవెంట్ల నిర్వహణ

ఈ మహోత్సవ్‌లో మొత్తం 80 ఈవెంట్లను నిర్వహించనున్నారు. స్పోర్ట్స్ ఫీట్‌లో వాలీబాల్, బాస్కెట్‌బాల్, కబడ్డీ, టేబుల్ టెన్నిస్, చెస్, అథ్లెటిక్స్, త్రోబాల్, ఫుట్‌బాల్, హాకీ, తైక్వాండో, ఖోఖో, ట్రాక్ అండ్ ఫీల్డ్ ఈవెంట్స్, యోగాసన వంటి తదితర క్రీడాంశాల్లో జాతీయస్థాయిలో విద్యార్థులకు పోటీలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. మ్యూజిక్, లిటరరీ, స్పాట్‌లైట్, డాన్స్, డ్రమాటిక్స్ అండ్ ఫిల్మ్ మేకింగ్, ఫ్యాషన్, ఫైన్ ఆర్ట్స్, కలనరల్స్, థియేటర్ ఆర్ట్స్ వంటి తదితరాలతోపాటు సాంకేతిక, సాంస్కృతికాంశాల్లో జాతీయస్థాయిలో పోటీలు ఉంటాయని వీసీ వివరించారు.

విద్యార్థికి రూ. వెయ్యి..!

విద్యార్థుల నుంచి రూ.వేల ఫీజులు వసూలు చేస్తున్న కార్పొరేట్ జూనియర్ కళాశాలలు ప్రాక్టికల్స్ నిర్వహణ భారాన్ని సైతం వారిపైనే మోపుతున్నాయి. ఐఐటీ, నీట్ కోచింగ్ పేరుతో ఫీజుల రూపంలో రూ.50 వేల నుంచి రూ.లక్షన్నర వరకు తీసుకుంటున్నాయి. ఇప్పుడు ప్రాక్టికల్స్‌కు రూ.వెయ్యి చొప్పున ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నాయి. లేదంటే హాల్ టిక్కెట్లు ఇవ్వబోమంటూ వేధిస్తున్నాయి.



ప్రాక్టికల్స్ చేస్తున్న విద్యార్థులు (ఫైల్)

'కార్పొరేట్' కళాశాలల కక్కుర్తి

- విద్యార్థులపైనే ఇంటర్ ప్రాక్టికల్స్ నిర్వహణ భారం
- ల్యాబ్ మెయింటినెన్స్ అంటూ రూ.వెయ్యి వంతున డిమాండ్
- చెల్లించకుంటే హాల్ టిక్కెట్లు ఇవ్వబోమని బెదిరింపులు
- పబ్లిక్ పరీక్షలతోపాటు ప్రాక్టికల్స్ ఫీజు కూడా చెల్లించిన విద్యార్థులు

గుంటూరు ఎడ్యుకేషన్ : ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షల్లో భాగంగా ఒకేషనల్ కోర్సుల విద్యార్థులకు బుధవారం ప్రాక్టికల్స్ ప్రారంభం అయ్యాయి. సీనియర్ ఇంటర్ ఎంపీసీ, బైపీసీ విద్యార్థులకు ఈ నెల 10 నుంచి 20 వరకు ప్రాక్టికల్స్ జరగనున్నాయి. విద్యార్థులకు చదువుతున్న కళాశాలలో పరీక్షలు జరుగుతాయి. గుంటూరు జిల్లా వ్యాప్తంగా 119 కళాశాలల్లో జరగనున్నాయి. వాటిలో నాలుగు ప్రభుత్వ జూనియర్ కళాశాలలు. మిగిలినవి ఎయిడెడ్, ప్రైవేటు కళాశాలలు. 26,308 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. దాదాపు 90 శాతం మంది కార్పొరేట్ కళాశాలల వారే. ఏడాది పొడవునా తరగతిగదిలో థియరీతోపాటు ప్రయోగశాలల్లో ప్రాక్టికల్స్ చేయించేందుకు కలిపి యాజమాన్యాలు ఫీజులు వసూలు చేస్తున్నాయి. ప్రాక్టికల్స్ తూతూ మంత్రంగా చేయించి చేతులు దులుపుకొన్నాయి. బోర్డు పబ్లిక్ పరీక్షల షెడ్యూల్ ఇచ్చాక జనవరిలో ల్యాబ్‌లకు పంపి ప్రాక్టికల్స్ చేయిస్తుండటం ఏటా జరిగే తంతు. థియరీతోపాటు ప్రాక్టికల్స్‌కు పరీక్ష ఫీజుగా బోర్డుకు రూ.875 వంతున విద్యార్థులు చెల్లించారు. వాస్తవానికి ప్రాక్టికల్స్ నిర్వహణకు ప్రతి కళాశాలకు విద్యార్థుల సంఖ్య ఆధారంగా రూ.ఐదు వేల వరకు బోర్డే చెల్లిస్తోంది.

కొరవడిన ప్రభుత్వ నియంత్రణ

ప్రైవేటు, కార్పొరేట్ కళాశాలలపై ప్రభుత్వ నియంత్రణ కొరవడిన ఫలితంగా రూ.వేలల్లో ఫీజులు, పుస్తకాలకు రూ.12 వేలు, యాప్ పేరుతో మరొక రూ.3 వేలు వంతున ప్రైవేటు, కార్పొరేట్ జూనియర్ కళాశాలలు వసూలు చేస్తున్నాయి. ప్రాక్టికల్స్ పేరుతో ప్రతి క్యాంపస్ నుంచి రూ.లక్షల్లో వసూళ్లకు పాల్పడుతున్నాయి. శాఖాపరమైన చర్యలు, జరిమానాల విధింపు లేక యాజమాన్యాలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయి.

ప్రాక్టికల్స్ పేరుతో వసూళ్లకు వీల్లేదు

ప్రాక్టికల్స్ పేరుతో విద్యార్థుల నుంచి నగదు వసూలు తగదు. ల్యాబ్ మెయింటినెన్స్ పేరుతో అనధికారికంగా వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. దీనిపై తల్లిదండ్రులు ఫిర్యాదు చేస్తే ఇంటర్ బోర్డు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. అనధికారికంగా డబ్బులు వసూలు చేస్తున్న కళాశాలల ప్రిన్సిపల్స్‌పై చర్యలు చేపడతాం.

– జీకే జుబేర్, ఆర్ఐవో, గుంటూరు

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో బుధవారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్ఠం : రూ. **3,800** గరిష్ఠం : రూ. **4,400**

మోడల్ ధర రూ. **4,200**

క్లుప్తంగా

8 వరకు దరఖాస్తు గడువు పెంపు

నెహ్రూనగర్: గుంటూరు, పల్నాడు జిల్లాలో గీత సామాజిక వర్గాలకు కేటాయించిన మద్యం షాపులకు దరఖాస్తు గడువు ఈ నెల 5వ తేదీ వరకు ఉండగా.. దీనిని 8వ తేదీ వరకు పొడిగించినట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ కె. శ్రీనివాసులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. గుంటూరు జిల్లాకు సంబంధించి స్వీకరించిన దరఖాస్తులలో 10వ తేదీ ఉదయం 9 గంటలకు బ్రాడీపేట 6వ లైనులోని ప్రొహిబిషన్ ఎక్సైజ్ కార్యాలయంలో, పల్నాడు జిల్లాకు సంబంధించిన దరఖాస్తులలో పీజీఆర్ఎస్ హాల్, కలెక్టరేట్ కార్యాలయంలో ఆయా జిల్లాల కలెక్టర్ల చేతుల మీదుగా లాటరీ తీయడం జరుగుతుందన్నారు.

8 నుంచి నాటకోత్సవాలు

నగరంపాలెం: ఈ నెల 8, 9వ తేదీల్లో డాక్టర్ కాసరనేని సదాశివరావు కళా సమితి 13వ నాటకోత్సవాలను నిర్వహించనున్నట్లు కళా సమితి చైర్మన్ డాక్టర్ యర్రా నాగేశ్వరరావు, కన్వీనర్ కాట్రగడ్డ రామకృష్ణప్రసాద్ బుధవారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. రెండు రోజులపాటు బృందావన్‌గార్డెన్స్ శ్రీవెంకటేశ్వరస్వామి దేవస్థాన ఆవరణలో నాటకోత్సవాలు జరుగుతాయని అన్నారు. 8న సాయంత్రం శ్రీసాయి కార్తీక్ క్రియేషన్స్ (కాకినాడ) ఆధ్వర్యంలో దేవుడు కనిపించాడు అనే నాటిక, పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్‌కు డాక్టర్ కాసరనేని ఆత్మీయ పురస్కారం అందజేస్తామని చెప్పారు. ప్రతిభావంతులైన పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు అందిస్తామని అన్నారు. 9వ తేదీన సాయంత్రం హాస్యవల్లరి, సారీ.. రాంగ్ నంబర్, తరమెళ్లి పోతున్నదో అనే నాటికలు ప్రదర్శిమవుతాయని తెలిపారు.

ఆరోగ్య సహాయకుల మౌన ధ్యానం

తాడేపల్లి రూరల్: వైద్య ఆరోగ్య శాఖలో ఆరోగ్య సహాయకులను ఉద్యోగం నుంచి తొలగించి రెండు నెలలు దాటినా నేటికీ పునరి న్నియామకానికి నోచుకోకపోవడంతో బుధవారం మౌన ధ్యాన్యం చేశారు. ఆంధ్రప్రదేశ్ పారా మెడికల్ కాంట్రాక్టు ఉద్యోగుల సంఘం రాష్ట్ర కన్వీనర్ జీవీవీ ప్రసాద్ ఆధ్వర్యంలో మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయం ఆవరణలో ఎన్టీఆర్ విగ్రహం ముందు దీనిని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ.. రాష్ట్రంలోని 920 మంది ఆరోగ్య సహాయకులు నడిరోడ్డుపై పడ్డారని, అధికార తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయానికి పలుమార్లు వచ్చి పార్టీ పెద్దలకు సమస్యను వివరించామన్నారు. కష్టకాలంలో ఉన్న తమను తక్షణమే ఆదుకోవాలని కోరామని పేర్కొన్నారు. హైకోర్టు ఇచ్చిన తీర్పు మేరకు మెరిట్ ఆఫ్ ఆర్డర్ చేసి తమకు తిరిగి ఉద్యోగాలు ఇచ్చి ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ పారా మెడికల్ కాంట్రాక్టు ఉద్యోగులు పాల్గొన్నారు.

బిల్లు చూస్తే బుర్ర గిర్రున తిరగాల్సిందే!

- కూటమి 'స్మార్ట్' దెబ్బకు మూడింతలు అధికంగా వచ్చిన విద్యుత్ బిల్లు
- పాత మీటరులో ఓ హోటల్‌కు నవంబరులో బిల్లు మొత్తం రూ. 17,821
- స్మార్ట్ మీటరు బిగించాక ఫిబ్రవరి బిల్లు ఏకంగా రూ. 61,478





హోటల్‌కు ఫిబ్రవరి నెలలో వచ్చిన విద్యుత్ బిల్లు

పొన్నూరు: విద్యుత్ బిల్లులు మోత మోగిస్తున్నాయి. పొన్నూరు పట్టణంలోని ముబారక్‌నగర్‌కు చెందిన ఓ హోటల్ (సర్వీసు నెంబర్ 1722100014916)కు ఈ నెల 3వ తేదీన రూ. 61,478 బిల్లు రావడంతో నిర్వాహకులు కంగుతిన్నారు. ప్రతి నెలా రూ. 20 వేలకు మించి రాని బిల్లు ఒకేసారి మూడింతలు పెరిగడంతో లబోదిబోమంటున్నారు. డిసెంబరు నెల 4వ తేదీన పాత మీటరు ఉన్నపుడు రూ.17,821 బిల్లు వచ్చినట్లు విద్యుత్ అధికారులు డిమాండ్ నోటీసు అందించారు. అదే నెలలో ఆ హోటల్‌కు స్మార్ట్ మీటర్ బిగించారు. ఈ నెల బిల్లు ఎందుకు ఎక్కువ వచ్చిందని చూస్తే 5495 యూనిట్ల వినియోగానికి రూ. 61,478 వేలు వేశారు. వాటిలో ఎనర్జీ చార్జీ రూ. 55,081, ఫిక్స్‌డ్ చార్జీ రూ.825, కస్టమర్ చార్జీ రూ. 45, ఎలక్ట్రిసిటీ డ్యూటీ రూ.1330, సర్‌చార్జ్ రూ. 345, ఎఫ్‌పీపీసీఏ (2022-05) కింద రూ.1,077, ఎఫ్‌పీపీసీఏ (2023-04) కింద రూ.857, ఎఫ్‌పీపీసీఏ (2024-12) కింద రూ.1,904లు ఉన్నట్లు పేర్కొన్నారు. దీనిపై హోటల్ నిర్వాహకులు అధికారులకు ఫిర్యాదు చేశారు. బిల్లు చెల్లించాల్సిందేనని వారు తేల్చిచెప్పారని బాధితుడు వాపోయారు. దీనిపై పొన్నూరు ఏఈ వెంకయ్య మాట్లాడుతూ.. స్మార్ట్ మీటర్లు ఉపయోగించే వ్యాపారులు మోటార్లు, కెపాసిటర్లకు ఆన్ -ఆఫ్ స్విచ్చులు ఏర్పాటు చేసుకోవాలన్నారు. మిషన్లు అలాగే ఉంచితే రీడింగ్ నమోదు అవుతూనే ఉంటుందని చెప్పారు. అధిక బిల్లు విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు.

కమిషనర్‌కు కాంట్రాక్టర్లు అల్టిమేటం

పెండింగ్ బిల్లుల సంగతి తేల్చాలని డిమాండ్



కమిషనర్ పులి శ్రీనివాసులుతో సమావేశమైన కాంట్రాక్టర్లు

నెహ్రూనగర్: గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో జరిగిన అభివృద్ధి పనులకు బిల్లులు చెల్లింపులు చేయకపోతే పనులు నిలిపివేయాల్సిన పరిస్థితి వస్తుందని.. పెండింగ్‌లో ఉన్న బిల్లులు ప్రాసెస్ చేయాలని కాంట్రాక్టర్లు నగర కమిషనర్ పులి శ్రీనివాసులును కలిసి అల్టిమేటం జారీ చేశారు. చాలా మంది కాంట్రాక్టర్లు బిల్లులు చెల్లింపులు ఆలస్యం కావడంతో పెట్టుబడి కోసం తీసుకువచ్చిన అసలు, వడ్డీ కలిపి తడిసిమోపెడు అవుతోంది. జీఎంసీ పరిధిలో కొన్ని రూ.వందల కోట్ల పనులు జరిగాయని, వాటికి ఇంత వరకు ఎన్నింటికి బిల్లులు ప్రాసెస్ చేశారని, పెండింగ్‌లో ఎన్ని వర్కులు ఉన్నాయి, టెండరింగ్ స్టేజ్‌లో ఎన్ని వర్కులు ఉన్నాయి తదితర వివరాలు తమకు తెలియజేయాలని కోరారు. భవిష్యత్తులో జరిగే పనులకు ఏ విధంగా బిల్లుల చెల్లింపు చేస్తారో అనే దానిపై కూడా స్పష్టత ఇవ్వాలని పేర్కొన్నారు. ఇప్పుడు చేసిన వర్కులకు పేమెంట్ షెడ్యూల్ ఇవ్వాలని కోరారు.

సీఎఫ్ఎంఎస్‌లో డబ్బులు ఉన్నాయా?

గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో జరిగే అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులను సీఎఫ్ఎంఎస్‌లో అప్‌లోడ్ చేసిన తరువాత వాటికి చెల్లింపులు జరుగుతాయి. ఇటీవల సీఎం చంద్రబాబునాయుడు రూ.10 లక్షలలోపు ఉన్న బిల్లులకు వెంటనే చెల్లింపులు జరపాలని ఆదేశించారు. అయితే చాలా మంది కాంట్రాక్టర్ల బిల్లులను నగరపాలక సంస్థ అధికారులు సీఎఫ్ఎంఎస్‌లో నమోదు చేయలేదు. దీంతో చాలా మందికి రూ.10 లక్షలలోపు బిల్లులు కూడా రాని పరిస్థితి. ప్రస్తుతం బిల్లులు ఇవ్వకుంటే తమ మనుగడ ప్రశ్నార్థకంగా మారే ప్రమాదంలో ఉందని కాంట్రాక్టర్లు బహిరంగంగానే ఇంజినీరింగ్ అధికారుల వద్ద పేర్కొంటున్నారు. ఇప్పుడు సీఎఫ్ఎంఎస్ ద్వారా బిల్లులు ప్రాసెస్ చేస్తామంటున్నారు. సీఎఫ్ఎంఎస్‌లో డబ్బులు ఉన్నాయా.. లేవా? వంటి సందేహాలు కమిషనర్ వద్ద కాంట్రాక్టర్లు లెవనెత్తినట్లు సమాచారం. శుక్రవారం కాంట్రాక్టర్లు, ఇంజినీరింగ్ అధికారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేస్తామని కమిషనర్ హామీ ఇచ్చారు. సీనియార్టీ ప్రకారం బిల్లుల చెల్లింపు ఉంటుందన్నారు. కాంట్రాక్టర్స్‌కి అత్యవసర పరిస్థితుల్లో బిల్లులు ప్రాసెస్ చేస్తామన్నారు.

పంచాయతీ సిబ్బందికి శిక్షణ



శిక్షణ కార్యక్రమంలో బి.వి. నాగ సాయి కుమార్

ప్రత్తిపాడు: ప్రత్తిపాడు మండలం తుమ్మలపాలెం సాలిడ్ వేస్ట్ ప్రాసెసింగ్ సెంటర్‌లో బుధవారం 'స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛ దివస్' కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని 20 ఉత్తమ పంచాయతీల కార్యదర్శులు, క్లాప్‌మిత్రలు, పారిశుద్ధ్య సిబ్బందికి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన డీపీవో బి.వి. నాగసాయికుమార్ ఒక ఈవోపీఆర్డీని ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్లు నిర్వహణ, వర్మీ కంపోస్టుపై మాట్లాడమని సూచించారు. దీంతో దుగ్గిరాల మండలం ఈవోపీఆర్డీ జవహర్‌లాల్ నెహ్రూ ముందుకు వచ్చారు. వివిధ విధుల నిర్వహణలో సెక్రటరీలకు మినహాయింపు ఇచ్చేలా ఎంపీడీవోలకు సూచించాలని కోరారు. డీపీవోగా తనకు కలెక్టర్ వద్ద నాలుగు మీటింగులు ఉంటాయని, అయినా డ్యూటీ వదిలేస్తానా అని నెహ్రూని డీపీవో ప్రశ్నించారు. ఈ నేపథ్యంలో తాను టైం టు టైం చెక్ చేయడం స్టార్ట్ చేస్తే గ్రామంలో పంచాయతీ సెక్రటరీ ఏం చేస్తున్నారో తెలిసిపోతుందన్నారు. సిస్టమ్ గురించి తనకు చెప్పొద్దని హెచ్చరించారు. అనంతరం డీపీఆర్సీ డీసీ పద్మారాణి మాట్లాడుతూ చెత్త నుంచి సంపద ఎలా సృష్టించుకోవాలి, తడి - పొడి చెత్తలను వేరు చేయడంపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో తెనాలి డీఎల్‌పీవో స్వరూపారాణి తదితరులు పాల్గొన్నారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

కాకుమాను: అప్పుల బాధతో పురుగుల మందు తాగి ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మండల కేంద్రం కాకుమాను శివారులో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. కాకుమాను ఎస్ఐ ఏక్‌నాథ్ కథనం మేరకు... పెదనందిపాడు మండలం గోగులమూడి గ్రామానికి చెందిన చెన్నుపాటి విజయ వెంకట శివప్రసాద్ అనే వ్యక్తి నాలుగేళ్లుగా దుబాయ్‌లో ప్రైవేట్ టీచర్‌గా పని చేస్తున్నాడు. అప్పుడప్పుడు స్వగ్రామమైన గోగులమూడి వచ్చి వెళ్తుంటాడు. మంగళవారం దుబాయ్ నుండి వచ్చాడు. బయటకు వెళ్తున్నానని కుటుంబ సభ్యులకు చెప్పి కాకుమాను, పుసులూరు గ్రామాల మధ్య పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. అప్పుల బాధలే దీనికి కారణంగా తెలిసింది. బుధవారం అతడి భార్య వెంకట సునయన ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ముగిసిన తమిళనాడు వ్యవసాయాధికారుల పర్యటన

సాక్షి, అమరావతి: వ్యవసాయ సంస్కరణలు, సాంకేతిక అంశాల పరిశీలన కోసం రాష్ట్రానికి వచ్చిన తమిళనాడు అధికారుల బృందం పర్యటన బుధవారం ముగిసింది. ఆ రాష్ట్ర వ్యవసాయ ఉన్నతాధికారి బాలసౌందరి నేతృత్వంలో నలుగురు సభ్యుల బృందం రెండురోజుల పాటు ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ ప్రాంతాల్లో పర్యటించినట్టు వ్యవసాయ సహాయ కమిషనరేట్ ఓ ప్రకటనలో పేర్కొంది. తొలిరోజు గుంటూరులోని కమిషనరేట్‌లో పొలం పిలుస్తోంది, ప్రకృతి వ్యవసాయం, ఈ-క్రాప్‌లో పంటల నమోదు, కౌలు రైతులకు రుణ విధానం, వడ్డీ లేని రుణాలు తదితర వాటి మార్గదర్శకాలను అడిగి తెలుసుకున్నారు. మంగళగిరిలోని సమీకృత వ్యవసాయ పరీక్ష కేంద్రాన్ని సందర్శించారని వివరించారు. రెండోరోజు గుంటూరు జిల్లాలోని రైతు సేవా కేంద్రాల ద్వారా అందిస్తున్న సేవలపై అధ్యయనం చేసినట్టు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయశాఖ డిప్యూటీ డైరెక్టర్ వెంకటేశ్వరరావు, అదనపు డైరెక్టర్ ఆచారి తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను మభ్యపెట్టిన కేంద్ర బడ్జెట్

డాక్టర్ యలమంచిలి శివాజీ



సమావేశంలో మాట్లాడుతున్న రాజ్యసభ మాజీ సభ్యుడు డాక్టర్ యలమంచిలి శివాజీ

లక్ష్మీపురం: కేంద్రం ప్రవేశ పెట్టిన 2025-26 బడ్జెట్ మాటల గారడీగానే కొనసాగిందని, ప్రజలను మభ్యపెట్టేలా ఉందని రాజ్యసభ మాజీ సభ్యుడు డాక్టర్ యలమంచిలి శివాజీ అన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఆధ్వర్యంలో బుధవారం బడ్జెట్‌పై విశ్లేషణలో ఆయన మాట్లాడుతూ... అన్ని బడ్జెట్‌లలోనూ పేదలను కేంద్ర ఆర్థిక మంత్రి విస్మరించారన్నారు. చెప్పిన దానికి, వాస్తవ కేటాయింపులకు పొంతన ఉండటం లేదని తెలిపారు. గ్రోత్ రేట్ పెరిగి పోతుందనేది అబద్ధమన్నారు. ప్రజల జీవన ప్రమాణాలు పెరగకుండా విదేశాల బడ్జెట్ లెక్కలతో పోల్చి చెప్పుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఆర్థిక సరళీకరణ పేరు కాపాడే బడ్జెట్‌లా ఉందని, ప్రజా ప్రయోజనాల బడ్జెట్‌గా లేదన్నారు. ఆర్థికవేత్త డాక్టర్ అబ్బరాజు శేఖర్ మాట్లాడుతూ.. వికసిత భారత్ వృద్ధి లక్ష్యాలకు అనుగుణంగా బడ్జెట్ పరిణామం, కేటాయింపులు లేవన్నారు. మధ్యతరగతికి అనుకూలంగా ఇన్‌కంటాక్స్ స్లాబ్‌లు మార్చడం హర్షణీయమని పేర్కొన్నారు. వ్యవసాయ అభివృద్ధి, రైతుల సంక్షేమానికి కేటాయింపులు తగ్గించడం శోచనీయం అన్నారు. సంస్థ కార్యదర్శి కొండాశివరామిరెడ్డి, ఆర్థికవేత్త డాక్టర్ జి.సధాకర్, జొన్నలగడ్డ రామారావు, పాటిబండ్ల విష్ణు తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్‌లోకి సుజుకి ఎస్సెస్ 125 సీసీ స్కూటర్



నగరంపాలెం: స్థానిక ఆటోనగర్ సరిపూడి సుజుకి బ్రాంచిలో బుధవారం సుజుకి ఎస్సెస్ 125 సీసీ స్కూటర్‌ను మార్కెట్‌లోకి విడుదల చేశారు. సరిపూడి సుజుకి సంస్థ అధినేత సరిపూడి అనిల్‌కుమార్, ఎస్ఎంఐపీఎల్ ఆర్ఎం శివరామకృష్ణ, ఏఆర్ఎం బాలకృష్ణ, సీఈఓ శ్రీనివాసరావు దీనిని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. టూ వీలర్ విక్రయ రంగంలో సుజుకికి ఎంతో పేరు ప్రఖ్యాతులు ఉన్నాయని అన్నారు. సుజుకి ఎస్సెస్ 125 సీసీ స్కూటర్‌ను ప్రారంభించడం అభినందనీయమని చెప్పారు. అన్నివర్గాలతోపాటు యువతకు ఆకర్షణీయంగా ఉంటుందని అన్నారు. సంస్థ అధినేత సరిపూడి అనిల్‌కుమార్ మాట్లాడుతూ ఈ స్కూటర్ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో తయారైందని అన్నారు. డ్రైవింగ్‌కు సులువైందని చెప్పారు. నాణ్యతలో సాటిలేని స్కూటర్ అని అన్నారు. ఈ స్కూటర్ పదేళ్ల వారెంటీతో ఖాతాదారులకు అందిస్తున్నామని తెలిపారు.

వ్యాయామ ఉపాధ్యాయుడికి పతకాలు

చెరుకుపల్లి: ఓ పక్క తన విద్యార్థులను ఉత్తమ క్రీడాకారులు గా తీర్చిదిద్దుతూనే మరోవైపు తానూ జాతీయస్థాయిలో రాణిస్తున్నారు వ్యాయామ ఉపాధ్యాయుడు తుమ్మా శ్రీనివాసరెడ్డి. చెరుకుపల్లి మండలం పొన్నపల్లి గ్రామానికి చెందిన ఆయన భట్టిప్రోలు మండలం ఐలవరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయునిగా పని చేస్తున్నారు. గత ఏడాది డిసెబర్ 28,29 తేదీలలో గుంటూరు ఎన్టీఆర్ స్టేడియంలో జరిగిన రాష్ట్ర స్థాయి మాస్టర్ అథ్లెటిక్ 60 సంవత్సరాల విభాగంలో లాంగ్‌జంప్, పోల్‌వాల్ట్‌లో తన ప్రతిభ కనపరిచి గోల్డ్ మెడల్స్ సాధించి జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించారు. అనంతరం కేరళ రాష్ట్రం త్రిస్సూల్ జిల్లా కున్నాంకులం స్టేడియంలో జనవరి 31 నుంచి ఫిబ్రవరి 4వరకు జరిగిన జాతీయ స్థాయి మాస్టర్ అథ్లెటిక్స్ పోటీలలో పాల్గొని లాంగ్ జంప్‌లో 4.22 మీటర్లలో కాంస్యపతకం, పోల్‌వాల్ట్ లో1.80 మీటర్లలో కాంస్య పతకం సాధించారు.

కాలువలో జారిపడి వ్యక్తి గల్లంతు



బసప్ప (ఫైల్)

నకరికల్లు: కాలువలో జారిపడిన వ్యక్తి గల్లంతయ్యాడు. ఈ సంఘటన నకరికల్లు పరిధిలోని శ్రీరాంపురం వద్ద గల బెల్లంకొండ బ్రాంచికెనాల్‌లో బుధవారం జరిగింది. సంఘటనకు సంబంధించి ఎస్ఐ చల్లా సురేష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కర్ణాటక రాష్ట్రం బీదర్‌కు చెందిన బసప్ప (40) లారీ డ్రైవర్‌గా జీవనం సాగిస్తుంటాడు. చెన్నై నుంచి లారీలో వస్తూ బెల్లంకొండ బ్రాంచికెనాల్ వద్ద లారీ ఆపాడు. కాలువలో బట్టలు ఉతుక్కునేందుకు వెళ్లి జారిపడి గల్లంతయ్యాడు. ఆచూకీ కోసం ఫైర్ సిబ్బంది, పోలీసులు గాలింపుచర్యలు చేపట్టినప్పటికీ ఫలితం లేకపోయింది. ఘటనపై కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చెట్టును ఢీకొట్టిన కారు

ఇద్దరికి తీవ్ర గాయాలు

మద్దిపాడు: జాతీయ రహదారిపై వెళ్తున్న కారు అదుపు తప్పి చెట్టును ఢీకొనడంతో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన బుధవారం మధ్యాహ్నం మద్దిపాడు మండలం వెంకటరాజుపాలెం సమీపంలో చోటుచేసుకుంది. అందిన వివరాల ప్రకారం.. విజయవాడకు చెందిన బి.కొండలరావు, బాలాజీ తమ వ్యక్తిగత పనిపై కారులో గూడూరు వెళ్లారు. అక్కడ పని ముగించుకుని తిరిగి విజయవాడకు బయలుదేరారు. మార్గమధ్యంలో వెంకటరాజుపాలెం సమీపంలో వీరి కారు అదుపుతప్పి రహదారి పక్కన ఉన్న చెట్టును ఢీకొట్టింది. కారు ముందు సీట్లో కూర్చున్న బాలాజీకి నుదుటిపై, కొండలరావుకు తలపై తీవ్ర గాయాలయ్యాయి.

హోరాహోరీగా ఎడ్ల బండలాగుడు పోటీలు

న్యూకేటగిరీలో వేటపాలెం ఆర్‌కే బుల్స్‌కు ప్రథమస్థానం



న్యూకేటగిరీలో మొదటిస్థానం సాధించిన వేటపాలెం ఆర్‌కే బుల్స్

నాదెండ్ల: నాదెండ్ల-గణపవరం డొంక రోడ్డులో కొలువైయున్న శ్రీ నందికుంట విఘ్నేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న జాతీయస్థాయి ఎడ్ల బండలాగుడు పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. వీక్షకుల కేరింతలు, ఎడ్ల బల ప్రదర్శనతో దుమ్మురేపాయి. మంగళవారం రాత్రి, బుధవారం ఉదయం న్యూకేటగిరీ విభాగంలో 13 జతలు పాల్గొన్నాయి. బుధవారం మధ్యాహ్నం నుంచి సబ్ జూనియర్స్ విభాగంలో పోటీలు జరిగాయి. గురువారం మధ్యాహ్నం 2 గంటల నుంచి జూనియర్స్ విభాగంలో పోటీలు నిర్వహించనున్నారు.

న్యూకేటగిరీలో వేటపాలెం జతకు మొదటి బహుమతి

న్యూకేటగిరీలో 13 జతలు పాల్గొన్నాయి. బాపట్ల జిల్లా చుండూరు మండలం వేటపాలెంకు చెందిన ఆర్‌కే బుల్స్ అత్తోట శిరీష్‌చౌదరి, శివకృష్ణ చౌదరి ఎడ్ల జత 4750 అడుగుల దూరం లాగి ప్రథమ స్థానం కైవసం చేసుకున్నాయి. పల్నాడు జిల్లా చిలకలూరిపేటకు చెందిన షేక్ అబ్దుల్‌సత్తార్ ఎడ్ల జత 4602 అడుగుల దూరంతో రెండోస్థానంలో నిలిచింది. గుంటూరు జిల్లా పెదకాకాని మండలం కొప్పురావూరుకు చెందిన టీఎస్ఆర్ ఇన్‌ఫ్రా డెవలపర్స్ తోట శ్రీనివాసరావు జత 4500 అడుగుల దూరంతో మూడో స్థానంలో, గుంటూరు జిల్లా ప్రత్తిపాడు మండల పెదగొట్టిపాడుకు చెందిన జీఎల్ఆర్ బుల్స్ గరికపాటి లక్ష్మీచౌదరి జత 4250 అడుగుల దూరం లాగి నాలుగో స్థానంలో, గుంటూరు జిల్లా ప్రత్తిపాడు మండలం పాత మల్లాయపాలెంకు చెందిన సిద్ధంశెట్టి సామ్రాజ్యం జత 4110 అడుగుల దూరం లాగి ఐదో స్థానంలో, తెలంగాణ సూర్యాపేట, హుజూర్‌నగర్‌కు చెందిన జక్కుల సహస్రయాదవ్, డాక్టర్ హసన్ జత 4003 అడుగుల దూరం లాగి ఆరోస్థానంలో, నాదెండ్లకు చెందిన పాటిబండ్ల రామారావు జత 3750 అడుగుల దూరం లాగి ఏడో స్థానంలో, నరసరావుపేట మండలం దొండపాడుకు చెందిన యర్రం రాజశేఖర్, యశ్వంత్ జత 3393 అడుగుల దూరం లాగి ఎనిమిదో స్థానంలో, కృష్ణాజిల్లా తోట్లవల్లూరు మండలం చిన్నపుల్లిపాకకు చెందిన ఆర్‌వీఎస్ బుల్స్ జత 3372 అడుగుల దూరం లాగి తొమ్మిదో స్థానంలో నిలిచాయి. విజేతలైన ఎడ్ల జతల యజమానులకు నిర్వాహకులు షీల్డ్, నగదు అందించారు.

తిరునాళ్ల ఏర్పాట్లపై ఎస్పీ పరిశీలన

నూజెండ్ల (శావల్యాపురం): శాంతియుత వాతావరణలో తిరునాళ్ల వేడుకలు ఘనంగా నిర్వహించాలని జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు అన్నారు. బుధవారం నూజెండ్ల మండలం రవ్వారం గ్రామంలో వేంచేసియున్న శ్రీకొండ గురునాథ స్వామి తిరునాళ్ల వేడుకలు ఈనెల 12న జరుగుతున్న సందర్భంగా గా భద్రత ఏర్పాట్లును పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ కంచి శ్రీనివాసరావు విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ తిరునాళ్లలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా డ్రోన్ కెమెరా ద్వారా శాంతి భద్రతలను నిరంతరం పోలీసు శాఖ పర్యవేక్షణ చేస్తుందన్నారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉండటం చేత పార్టీ జెండాలను రాజకీయ నాయకులు ప్రసంగాలు ప్రభలపై నిషేధమని, నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఆలయ ప్రాముఖ్యతను అర్చకుల ద్వారా అడిగి తెలుసుకున్నారు. ట్రాఫిక్ ఆంక్షలు విధించటంతో పాటు పార్కింగ్ స్థలాలు ఏర్పాట్లు పరిశీలించారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని పటిష్టమైన భద్రత ఏర్పాట్లు చేయాలని పోలీసు అధికారులకు సూచించారు. అనంతరం స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పెరుమాళ్లకు సామూహిక కళ్యాణ మహోత్సవం



తాడేపల్లి రూరల్: ఎంటీఎంసీ పరిధిలోని సీతానగరం విజయకీలాద్రి దివ్యక్షేత్రంపై అన్ని ఆలయాల పెరుమాళ్లకు బుధవారం సామూహిక కళ్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ నిర్వాహకులు పురాణం వెంకటాచార్యులు మాట్లాడుతూ చిన్న జీయర్ స్వామి సమక్షంలో 8వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈ వేడుక నిర్వహించామని చెప్పారు. సాయంత్రం 5 గంటలకు శ్రీ స్వామి వారిని గరుడ వాహనంపై శ్రీనివాసుని గిరి పరిక్రమణ గావించామని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ వేదవిద్యార్థులు, భక్తులు, ఆలయ అర్చకులు తదితరులు పాల్గొన్నారు.